క్లుప్తంగా

బంగారు, వెండి కిరీటాల బహూకరణ



ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో కొలువైన సాయిబాబా గుడిలో ఆదివారం తొమ్మిదో వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఐటీ ప్రొఫెసర్ నందిరాజు వెంకట శ్రీకాంత్, డాక్టర్ అనీత ప్రియదర్శిని దంపతులు రూ.3లక్షల విలువ గల బంగారు, వెండి కిరీటాలు ఆలయానికి బహూకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మహాఅన్న దాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రిటైర్డ్ డీఎస్పీ రాజిరెడ్డి, జెడ్పీటీసీ వంగ రవీందర్, డాక్టర్ తిప్పని సుధాకర్, తారాబాయి, సూర్య ప్రకాశ్, అర్చకులు కోటేశ్వర్, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు



వేలేరు: మండలంలోని ఎర్రబెల్లి శివారులోని బైరవునిబండ వద్ద నిర్వహించిన సమ్మక్క –సారలమ్మ జాతర హుండీల్లో భక్తులు వేసిన కానుకలను నిర్వాహకులు కాలేరు పుష్పలీలా చిన్న బాబు ఆధ్వర్యంలో ఆదివారం లెక్కించారు. నాలుగు రోజులు నిర్వహించిన జాతరలో రూ.77,878 ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ అల్లం సతీష్, గ్రామస్తులు, కోయ పూజారులు తదితరులు పాల్గొన్నారు.

‘మెపా’ రాష్ట్ర కార్యదర్శిగా రమేష్ నియామకం

దామెర: మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని ల్యాదెల్లకు చెందిన పిట్టల రమేష్‌ముదిరాజ్ నియమితులయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ఈమేరకు ఆదివారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. ముదిరాజ్ కుల సంఘం బలోపేతం కోసం తన వంతు కృషిచేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ధర్మసాగర్: మండలంలోని పలు ప్రాంతాల్లో నేడు(సోమవారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ రూరల్ డీఈ సామ్యా నాయక్, ధర్మసాగర్ ఏఈ సుధాకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎల్కుర్తి ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు జరుగుతున్న కారణంగా ధర్మసాగర్, సాయిపేట, నారాయణగిరి సబ్‌స్టేషన్ల పరిధిలో సోమవారం మధ్యాహ్నం 1 (ఒంటి) గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అనుదీప్ శర్మకు గౌరవ డాక్టరేట్



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక రాజరాజేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు తాటిపాముల అనుదీప్ శర్మ ఆస్ట్రాలజీ స్పిరిచ్వాలి్ట రీసెర్చ్ విభాగంలో గౌరవ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. తమిళనాడులోని హుసూర్‌లో ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టా అందుకున్నారు. అనుదీప్ శర్మను ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అభినందించారు.

సమ్మేళనానికి తరలిన మహిళలు

ఆత్మకూరు: వరంగల్ నగరంలో ఆదివారం మహిళాశక్తి సమ్మేళన సమితి ఆధ్వర్యంలో జరిగిన మహిళాశక్తి సమ్మేళనానికి మండలకేంద్రం నుంచి మహిళలు తరలివెళ్లారు.

పండ్లు పంపిణీ

కాశిబుగ్గ : హనుమకొండలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో వరంగల్ ఆర్పీఎఫ్ సిబ్బంది ఆదివారం పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు కేంద్రంలోని మానసిక వికలాంగులు, అనాథలతో మాట్లాడి మానసిక ధైర్యాన్ని నింపారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తాగి డ్రైవింగ్ చేయొద్దు



టేకుమట్ల: బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షిస్తున్న ఎస్సై సుధాకర్



మొగుళ్లపల్లి: కారును తనిఖీ చేస్తున్న ఎస్సై మాధవ్‌గౌడ్, పోలీసులు

టేకుమట్ల : వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపొద్దని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై గట్ల సుధాకర్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని రామకిష్టాపూర్(టీ) శివారులో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారికి, సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల బారిన పడతారన్నారు. దీంతో శారీరకంగా, మానసికంగా నష్టపోవడంతో పాటు, కుటుంబం రోడ్డున పడుతుందని పేర్కొన్నారు. సురక్షితంగా గమ్యం చేరేందుకు మద్యం తాగి డ్రైవింగ్ చేయొద్దని అన్నారు. ఆయన వెంట కానిస్టేబుల్ సుమన్, ఇతర కానిస్టేబుళ్లు ఉన్నారు.

వాహనాల తనిఖీ

మొగుళ్లపల్లి : మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపంలో ఆదివారం ఎస్సై మాధవ్‌గౌడ్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన సరైన పత్రాలు, లైసెన్స్ ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేయొద్దన్నారు. అలాగే కారులో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీటు బెల్ట్ ధరించాలన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

టేకుమట్ల : మండలంలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గజ్జి సుజాతరమేష్, ఎస్సారెస్పీ మాజీ చైర్మన్ ఎండీ మైనొద్దీన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అంబరగొండ బాబురావు, పోతుగంటి వసంతరావు, ప్రధాన కార్యదర్శి గజ్జి కుమార్, మాజీ వార్డ్ మెంబర్లు కొండి తిరుపతి, ముష్క రాయకొమురు, కరట్లపల్లి రాములు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపానికి శంకుస్థాపన



భూమిపూజ చేస్తున్న బాధ్యులు

వాజేడు : మండల పరిధిలోని జంగాలపల్లిలో మార్చి 8నుంచి నిర్వహించే శివపార్వతుల కల్యాణ మండపానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ మేరకు పార్వతీ సమేత ఉమారామలింగేశ్వర స్వామి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. అనంతరం స్వామి వారి కల్యాణోత్సవానికి చలువ పందిళ్లు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

తప్పిపోయిన వ్యక్తిని కుటుంబసభ్యులకు అప్పగింత



వ్యక్తిని అప్పగిస్తున్న పోలీసులు

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరం ఆలయ దర్శనానికి వచ్చి తప్పిపోయిన ఓ వ్యక్తిని కుటుంబ సభ్యులకు ఎస్సై పీవీఎస్. భవానిసేన్ అప్పగించారు. ఆదివారం భూపాలపల్లికి చెందిన సింగరేణి ఉద్యోగి కొంటం శంకర్ కుటుంబ సభ్యులతో దర్శనానికి వచ్చి మధ్యాహ్నం తప్పిపోయాడు. అతని భార్య, సోదరులు ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించగా సాయంత్రం ఆచూకీ తెలియడంతో కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఏఎస్సై రాజేశం, కానిస్టేబుల్ రమేష్ తదితరులు ఉన్నారు.

సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలి

భూపాలపల్లి రూరల్ : బంజారాల ఆరాధ్య దైవం సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను ఈనెల 29వ తేదీన జిల్లా కేంద్రంలోని భారత్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ కన్వీనర్ అజ్మీరా తిరుపతి, కో కన్వీనర్ భూక్యా సురేష్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్యఅతిథిగా హాజరు అవుతున్నట్లు పేర్కొన్నారు. అన్ని కుల సంఘాలు, ఉద్యోగ సంఘాల నాయకులు, బంజారాలు ప్రతీఒక్కరు ఈ వేడుకలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

మల్హర్ : మండలంలోని కొయ్యూరు నుంచి రుద్రారం వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాలు, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో నిధులు మంజూరు చేయించినట్లు ఎంపీపీ చింతలపల్లి మల్హర్ రావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొయ్యూరు నుంచి రుద్రారం వరకు 13 కిలోమీటర్ల మేర సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా నిర్మాణానికి రూ.20 కోట్లు నిధులను ప్రభుత్వం విడుదల చేసినట్లు తెలియజేశారు. అలాగే తాడిచర్ల నుంచి కొయ్యూరు, పెద్దతూండ్ల కిషన్‌రావుపల్లి నుంచి భూపాలపల్లి వరకు ఉన్న అటవీ ప్రాంతంలో రోడ్డు నిర్మాణాలను త్వరలోనే ప్రారంభించనట్లు ఆయన పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణానికి నిధుల విడుదలకు సహకరించిన మంత్రి శ్రీధర్‌బాబుకు మండల ప్రజల పక్షాన ఎంపీపీ మల్హర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

అంబేడ్కర్ భావజాలాన్ని అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సారయ్య

ఎల్కతుర్తి: అంబేడ్కర్ భావజాలాన్ని ప్రతి ఒక్కరికీ అందించాల్సిన బాధ్యత అంబేడ్కర్ వాదులపై ఉందని జేఏసీ చైర్మన్ డేగల సారయ్య అన్నారు. ఆదివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ అంబేడ్కర్ భవనం ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గత కొన్నేళ్లుగా అంబేడ్కర్ సిద్ధాంతాలకు నేటి యువత దూరమవుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరినీ చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంబేడ్కర్ సంఘం బాధ్యతలు తీసుకునే నాయకులు వారు పనిచేస్తున్న రాజకీయ పార్టీలకు అతీతంగా పనిచేయడంతో పాటు రాబోయే తరానికి అంబేడ్కర్ సిద్ధాంతాలను అందించే విధంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ వాదులు, వివిధ దళిత సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల చించివేతలో ప్రమేయం లేదు

● కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిన్నబాబు



సమావేశంలో మాట్లాడుతున్న చిన్నబాబు

వేలేరు: మండలంలోని ఎర్రబెల్లి సమ్మక్క దగ్గర ఏర్పాటు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ ఫ్లెక్సీల చించివేతలో తన ప్రమేయం లేదని కాంగ్రెస్ పార్టీ నాయకుడు కాలేరు చిన్నబాబు అన్నారు. జాతర వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంత్రి ప్రభాకర్‌ను జాతరకు రావాలని ఆహ్వానించి, ఫ్లెక్సీలను సొంత ఖర్చులతో ఏర్పాటు చేశానని తెలిపారు. గురువారం రాత్రి 8 గంటల సమయంలో అమ్మవార్లను తీసుకురావడానికి స్థానిక గుట్టవద్దకు కోయ పూజారులతో వెళ్లి వచ్చేసరికే ఫ్లెక్సీలు చించివేసి ఉన్నాయని వివరించారు. కొంతమంది వ్యక్తులు తన రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేకనే తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు.

ప్రజాహిత పాదయాత్రను జయప్రదం చేయండి

● బీజేపీ మండల ఇన్‌చార్జ్ మధుకర్



ఎల్కతుర్తి: సమావేశంలో మాట్లాడుతున్న మధుకర్

ఎల్కతుర్తి: ఈనెల 28న మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చేపట్టనున్న ప్రజాహిత పాదయాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జ్ కరండ్ల మధుకర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు కుడితాటి చిరంజీవి ఆధ్వర్యంలో నిర్వహించగా.. మధుకర్ మాట్లాడారు. మండలంలోని ప్రతీ గ్రామం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి ప్రజలను ఏకం చేసి పాదయాత్రలో పాల్గొనే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పాదయాత్రలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కుడితాటి చిరంజీవి, నాయకులు ముష్కె వెంకటేష్, జనగాని కిష్టయ్య, చిదురాల వెంకటేష్, మధుకర్, అంచనగిరి వెంకటరమణ, కంచర్ల శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : ఈ నెల 29న రేగొండ మండల కేంద్రంలో జరిగే బీజేపీ విజయ సంకల్ప యాత్రకు శాయంపేట చెందిన పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని భూపాలపల్లి జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు పాలసాని తిరుపతిరావు అన్నారు. ఆదివారం ఆయన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలందరూ కష్టపడి సైనికులుగా పని చేసి నరేంద్ర మోదీని మూడోసారి ప్రధానిని చేయాలని పిలుపునిచ్చారు. యాత్రకు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రేగొండ మండల అధ్యక్షుడు దాసరి తిరుపతి రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు మోత్కురి సత్యనారాయణ, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు చిట్టిరెడ్డి మల్లారెడ్డి, చంద్రమౌళి, రాజశేఖర్, తిరుపతి, సీతారాం రెడ్డి, రాకేష్ రెడ్డి పాల్గొన్నారు.

మిర్చి పంటను పరిశీలించిన విదేశీయులు



మిర్చి పంటను పరిశీలిస్తున్న విదేశీయులు, స్థానిక రైతులు

మొగుళ్లపల్లి : మండలంలోని రంగాపురం గ్రామంలో సాగు చేసిన మిరప తోటలను ఆదివారం యూఎస్ఏలోని మెకర్మిక్ కంపెనీ ముఖ్య ప్రతినిధి ఎలీస్ బెల్స్, మాథ్యూస్ జాకబ్, ఐటీసీ కంపెనీ క్రాఫ్ డెవలప్‌మెంట్ మేనేజర్ అమరేందర్‌రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ సతీష్ ఆధ్వర్యంలో సందర్శించారు. రంగాపురం గ్రామ రైతులు వారికి డప్పు చప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. స్థానిక ఐటీసీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వ్యవసాయ స్టాళ్లను పరిశీలించారు. ఈసందర్భంగా రైతులు వారికి మెమెంటో అందించి శాలువాతో సన్మానించారు. కాగా వారు మిర్చి తోటలను సందర్శించి, పంటలకు సోకే వ్యాధులు, వాటి నివారణకు తీసుకునే సస్యరక్షణ చర్యలు, పంట తీసే విధానం, రైతులు ఎదుర్కొనే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ గత రెండేళ్లుగా మిరప ఎగుమతి లేదన్నారు. ఈ మధ్య కాలంలో మిరప తోట ఆకులపై ఎరుపు రంగు పురుగులు కనబడితే ఎర్రనల్లి సోకిందని రైతులు అపోహ పడి ఎక్కువ మోతాదులో మందులు పిచికారీ చేయడం జరిగిందన్నారు. మిర్చిపంటకు సోకింది ఎర్రనల్లి కాదని అది మగజాతి నల్ల తామర పురుగు అని రీసెర్చ్‌లో కనుగొన్నట్లు వివరించారు. ఒక కీటక నాశినికి మందు కనుగొనాలంటే సుమారు మూడు సంవత్సరాలు పడుతుందన్నారు. రైతులు మొక్క చిన్న దశ నుంచే ఎక్కువ మోతాదు కలిగిన పురుగు మందులు వాడటం సరికాదన్నారు. యూఎస్ఏకు 70శాతం మిర్చి భారత దేశమే అందిస్తోందన్నారు. వ్యవసాయ క్షేత్రంలో రైతులు పురుగు మందులు వాడిన తర్వాత వాటి డబ్బాలను ఎక్కడపడితే అక్కడ పడేయ వద్దన్నారు. వాటి వల్ల పరిసరాలు కాలుష్యమై రానున్న రోజుల్లో మానవ మనుగడ కష్టమౌతుందని, వాటి జాగ్రత్తలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఐటీసీ సిబ్బంది సురేష్, కుమార్, రైతులు విజేందర్‌రావు, రమేష్, సతీష్, రాజయ్య, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ ట్యాంకర్ బోల్తా

● డ్రైవర్‌కు స్వల్పగాయాలు



బోల్తా పడిన ఆయిల్ ట్యాంకర్

వాజేడు : మండల పరిధిలోని కృష్ణాపురం, కడేకల్ గ్రామాల మధ్య గల బ్రిడ్జి సమీపంలో ఆదివారం ఆయిల్ ట్యాంకర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి తెలంగాణకు వస్తున్న సమయంలో ట్యాంకర్ అదుపు తప్పి రోడ్డు పక్కకు బోల్తా కొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

జీఓ 317ను రద్దు చేయాలి

ఏటూరునాగారం : జీఓ 317ను వెంటనే రద్దు చేయాలని ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యాడ సురేందర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం 317జీఓపై సబ్ కమిటీలు వేయడం జరిగిందని, ఆ కమిటీలను కాలయాపన చేయకుండా జీఓను రద్దు చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. రాబోయే ఎంపీ ఎన్నికల ముందే ఈ ప్రక్రియ చేపట్టాలన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

వైభవంగా షహీద్ దర్గా ఉత్సవాలు

ఖిలావరంగల్: మధ్యకోటలోని హజ్రత్ చందా షహీద్ దర్గాలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ రఫీక్, ఉపాధ్యక్షుడు సయ్యద్ గౌస్, మహ్మద్ జహీద్ ఆధ్వర్యంలో గంధం, ఉర్సు ఉత్సవాలు ఆదివారం రాత్రి వైభవంగా ముగిశాయి. దర్గాను ముస్లిం మత గురువులు దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతాలకతీతంగా పెద్దఎత్తున భక్తులు దర్గాపై పూలుచల్లి మొక్కులు చెల్లించుకున్నారు. ముఖ్యఅతిథిగా కరీమాబాద్ ఉర్సు దర్గా పీఠాధిపతి ఉబేద్‌బాబా, స్థానిక కార్పొరేటర్ ఉమ, మాజీ కార్పొరేటర్ దామోదర్ హాజరై దర్గాను దర్శించుకున్నారు. కార్యక్రమంలో గౌస్‌బాబా, వలీ మహ్మద్, ఎగ్బాల్ హైమద్, సలీమ్, మున్ను, సిరాజ్, షఫీ, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ



రఘుబాబు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కృష్ణమూర్తి తదితరులు

గోవిందరావు పేట : కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ఎడ్లపల్లి రఘుబాబు విగ్రహాన్ని ఆ పార్టీ సీనియర్ నాయకుడు పైడాకుల కృష్ణమూర్తి ఆవిష్కరించారు. రఘుబాబు వర్ధంతి సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని దుంపెల్లిగూడెంలో గ్రామస్తులంతా కలిసి విగ్రహాన్ని ఏర్పాటు చేయగా, కృష్ణమూర్తి హాజరై రఘుబాబు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల, జిల్లా నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా రోడ్డు పనులు



అసంపూర్తిగా నిలిచిన తెట్టే పనులు

చిట్యాల : మండలంలోని నవాబుపేట–మొగుళ్లపల్లి గ్రామాల మధ్య గల చలివాగు వద్ద అసంపూర్తిగా రోడ్డు పనులు చేశారని అధికారులు త్వరితగతిన వాటిని పూర్తి చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నేరేళ్ల ఓదేలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అదివారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలతో తారు రోడ్డు పూర్తిగా కొట్టుకు పోవడంతో మళ్లీ అదే స్థానంలో అధికారులు సీసీ రోడ్డు నిర్మాణం చేశారు. కానీ సీసీ రోడ్డుకు ఇరువైపులా మొరం(సైడ్‌బర్మ్) పోయలేదని, అలాగే రోడ్డుపై రాళ్లను అక్కడే వదిలేశారని అన్నారు. అలాగే రోడ్డు పక్కన రాళ్లు పేర్చి తెట్టెకు సిమెంట్ వర్క్ చేయకుండా వదిలేశారని పేర్కొన్నారు. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయించాలని డిమాండ్ చేశారు.

ఐజేయూ నాయకుల హర్షం

కాటారం : తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా ఐజేయూ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి నియామకం కావడంతో ఐజేయూ జిల్లా నాయకులు, కాటారం ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు గైని రమేశ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సత్వర పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే చైర్మన్‌ను కలిసి జిల్లాలోని జర్నలిస్టుల సమస్యలను శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

ప్రెస్‌అకాడమీ చైర్మన్‌కు శుభాకాంక్షలు

ములుగు రూరల్ : తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డికి జిల్లా ఐజేయూ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షుడు ఎండి షఫీ, బేతి సతీష్‌యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. నూతన చైర్మన్ హయాంలో జర్నలిస్టుల సమస్యలు పరిష్కారమవుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కొండం రవీందర్, గంపల శివ, వాసు, శ్రీనివాస్, రమేష్, భిక్షపతి, మురళి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రంపహాడ్‌లో కొనసాగిన మొక్కులు



మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

ఆత్మకూరు: మండలంలోని అగ్రంపహాడ్ సమ్మక్క– సారలమ్మ జాతరలో ఆదివారం సెలవుదినం కావడంతో భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఎత్తు బంగారం(బెల్లం) సమర్పించారు. ఆర్డీఓ శ్రీనివాస్, ఈఓ శేషగిరి పర్యవేక్షించారు. అధికారులు హుండీలను తరలించారు.